క్లుప్తంగా

మహిళలు సంపూర్ణ అక్షరాస్యత సాధించాలి



మాట్లాడుతున్న ఏపీఎం హరినాథ్

రొంపిచెర్ల: మహిళలు సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని ఏపీఎం హరినాథ్ తెలిపారు. స్త్రీశక్తి భవనంలో గురువారం మహిళా వలంటీర్లకు రెండో విడత ఉల్లాస్ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 2,030 మంది నిరక్షరాస్యులను గుర్తించామని తెలిపారు. వారిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందకు ఉన్నతాధికారులు లక్ష్యంగా నిర్ణయించినట్టు తెలిపారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని వలంటీర్లు ప్రతి ఒక్కరికి బొమ్మలు, అంకెలు, మాటల ద్వారా చదువు చెప్పాలన్నారు. వారికి త్వరలోనే పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు.

మత్తుకు బానిస కావొద్దు



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ షెక్షావలి

సదుం: విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కారాదని ఎస్ఐ షెక్షావలి తెలిపారు. ఆయన గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మత్తుపదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు వినియోగిస్తుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటనాథరెడ్డి, చిత్తూరు ఈగల్ సెల్ హెచ్‌సీ గిరిబాబు, లెక్చరర్లు పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాయే లక్ష్యం



సిబ్బందితో ఎస్ఈ ఇస్మాయిల్

సదుం: జిల్లాలోని వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్టు ఎస్ఈ ఇస్మాయిల్ తెలిపారు. ఆయన గురువారం బలిజపల్లె సబ్ స్టేషన్‌లో రూ.కోటిన్నరతో ఏర్పాటు చేసిన 5 ఎంవీఏ సామర్థ్యం ఉన్న పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించారు. బలిజపల్లె సబ్ స్టేషన్ పరిధిలో అధిక లోడ్ నియంత్రణకు ఇది ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాసమూర్తి, బాబు, డీఈఈ నరేంద్ర, ఏఈలు చంద్రశేఖర్, హేమచంద్ర పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు ఆపాలని ధర్నా



రోడ్డుపై బస్సులను అడ్డుకుని సిబ్బందితో వాగ్వాదానికి దిగిన గ్రామస్తులు

చౌడేపల్లి: చౌడేపల్లె– పుంగనూరు మార్గంలోని ఠాణా కొత్తయిండ్లు బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలని కోరుతూ గ్రామస్తులు గురువారం ధర్నా చేశారు. గతంలో బస్టాఫ్ వద్ద పాపిశెట్టిపల్లె, ఠాణా కొత్తయిండ్లుకు చెందిన వారికి సౌకర్యంగా గతంలో బస్టాప్ వద్ద బస్సులు ఆపేవారు. ప్రస్తుతం ఆపడం లేదు. దీంతో ఆయా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులను కలిసి విన్నవించినా ఫలితం లేదు. ఈ క్రమంలో ఆగ్రహించిన గ్రామస్తులు గురువారం ఆర్టీసీ బస్సులను అడ్డుకుని డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వాదానికి దిగారు. ట్రాఫిక్ స్తంభించడంతో సమాచారం అందుకున్న సీఐ రాంభూపాల్ ఆదేశాల మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు



ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, సోమరాజు

పుంగనూరు: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 25 మంది ఎన్‌సీసీ 35ఎ బెటాలియన్ విద్యార్థులకు గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ సోమరాజు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. అంతేగాక ఈ సర్టిఫికెట్లు పొందిన వారికి పోటీ పరీక్షల్లో రిజర్వేషన్ ఉంటుందని తెలిపారు.

10 నుంచి ఆరాధనోత్సవాలు

పలమనేరు: పట్టణ సమీపంలో వున్న రాఘవేంద్రస్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి 12 వరకు స్వామి వారి 354వ ఆరాధనోత్సవాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు మోహనక్రిష్ణ తెలిపారు. ఈ నెల 10న పూర్వారాధన, 11న మధ్య ఆరాధన, 12న ఉత్తరాధన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

కౌండిన్య నదిని తోడేస్తున్నారు!

కూటమి నేతలు అధికారం అండతో రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. నదులు, వాగులు, చెరువులను వదలకుండా జేసీబీలతో ఇసుకను తవ్వి రహస్య ప్రాంతాల్లో డంప్ చేస్తున్నారు. రాత్రిళ్లు ఇతర రాష్ట్రాలకు అక్కడి ట్రక్కుల్లోనే తరలిస్తున్నారు. పలమనేరు నియోజకవర్గంలోని కౌండిన్య నదిని తోడేస్తున్నారు. నదిలో నీరు వున్నప్పటికీ ఇసుక తవ్వకానికి స్మగర్లు కొత్త ఉపాయాన్ని కనుగొన్నారు. జేసీబీలతో నీటిలోని మట్టిని, ఇసుకను కలియతిప్పి దాన్ని ఉద్దలుగా పోసి ఎండిన ఇసుకను రవాణా చేస్తున్నారు.

- కౌండిన్య నీరు నుంచి యథేచ్ఛగా ఇసుక తరలింపు
- నీరున్నా తవ్వకాలకు కొత్త టెక్నిక్
- రాత్రిళ్లు నీటిలో ఫిల్టరింగ్, పగలు ట్రాక్టర్లతో రవాణా
- రోజుకు 150 ట్రాక్టర్ల ఇసుక రవాణా



కౌండిన్య నదిలో ఇసుకను తోడుతున్న జేసీబీ

పలమనేరు: కౌండిన్య నది పలమనేరు నియోజకవర్గంలోని పలమనేరు, గంగవరం, పెద్దపంజాణి మండలాల్లో ప్రవహిస్తోంది. ఇందులో నాణ్యమైన ఇసుక వుంది. దీనికి ఇతర ప్రాంతాల్లో డిమాండ్ ఎక్కువగా వుంటోంది. దీన్ని గుర్తించిన ఇసుకాసురులు నదిని తోడేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు కౌండిన్య నదిలోకి నీరు చేరింది. నదిలో నీరు వున్నప్పటికీ తవ్వకాలు చేస్తున్నారు. నదిపక్కనున్న మట్టిని సైతం నీటిలోకి తోసి కలియ తిప్పడం ద్వారా మట్టి కిందకు వెళ్లి ఇసుక పైకి చేరుతుంది. దాన్ని జేసీబీలతో బయట పోస్తున్నారు. అందులోని నీరు పూర్తిగా పోయిన తర్వాత ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. నది పరివాహక ప్రాంతాల్లోని అక్రమార్కులకు కౌండిన్య నది వరంలా మారింది. గంగవరం మండలంలోని జీడిమాకులపల్లిలోనే 18 ట్రాక్టర్లు, రెండు జేసీబీలు వున్నాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

రహస్య డంపులకు ...

ఇసుకను రాత్రిళ్లు రహస్య ప్రాంతంలోని డంపులకు చేర్చుతున్నారు. టిప్పర్ లోడు ఇసుక చేరిందంటే వాట్సాప్‌లో లొకేషన్ సెండ్ చేస్తే చాలు కర్ణాటక ఇసుక వ్యాపారులు ఆ రాష్ట్రానికి చెందిన టిప్పర్లను తీసుకువచ్చి లోడు చేసుకుని వెళుతున్నారు. నగదు లావాదేవీలన్నీ ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా జరుగుతున్నాయి. దీనిపై తహసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

రోజుకు 150 ట్రాక్టర్ల ఇసుక తరలింపు

నదిలోని నీటిలో వున్న ఇసుకను జేసీబీతో కలియదిప్ప బయటకు వేయడం, ఆరిన తర్వాత ట్రాక్టర్లలో తరలించడం యథేచ్ఛగా చేస్తున్నారు. ఇలా ఒకరిని చూసి మరొకరు ఆయా గ్రామాల్లో నదిలో ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. నదిలో ఎటు చూసినా నీరు వున్న గుంతల్లో మట్టిలోడ్లను దింపేసిన దృశ్యాలు కనిపిస్తున్నాయి. నదికి ఆనుకుని ఉన్న గ్రామాల నుంచి రోజుకు 150 ట్రాక్టర్ల ఇసుక తరలివెళుతోంది.



ఫిల్టర్ అయిన ఇసుకను ట్రాక్టర్‌కు నింపుతున్న జేసీబీ



నదిలో వున్న ఫిల్టర్ పాయింట్లు

డ్రైవర్ సెల్‌పై చంద్రబాబు ఫొటో...

ఇసుక తరలించే ట్రాక్టర్లను అధికారులు, పోలీసులు అడ్డుకోకుండా డ్రైవర్ మెడలో పచ్చకండువా, సెల్‌ఫోన్ వెనుక చంద్రబాబు ఫొటో పెట్టుకున్నారు. కొందరు ట్రాక్టర్లకు పసుపు రంగు కూడా వేశారు. ఈ ట్రాక్టర్లకు ఎలాంటి నంబర్లు కూడా లేవు. గట్టిగా సౌండ్ పెట్టుకుని డెక్‌లో కూటమి పాటలను వేసుకుంటూ పట్టపగలే హైవేలో ఇసుక ట్రాక్టర్లు వెళుతున్నాయి. ఇదే మార్గంలో ఆర్‌డీవో, తహసీల్దార్, ఇరిగేషన్ కార్యాలయాలున్నాయి. హైవే పట్రోలింగ్ వాహనం కూడా తిరుగుతూనే ఉంటుంది. వీరిని అడిగే దిక్కులేకుండా పోయింది.

సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి

రొంపిచెర్ల: ప్రభుత్వం అమలు చేస్తున్న సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రావణి తెలిపారు. ఆమె గురువారం రొంపిచెర్లలోని రైతు సేవా కేంద్రంలో సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లబ్ధిదారులు తదితర వివరాలను సమాచార హక్కు చట్టం ద్వారా అధికారుల నుంచి పొందవచ్చన్నారు. అలా సమాచారం ఇవ్వని అధికారులపై కోర్టులో కేసులు నమోదు చేయవచ్చని వివరించారు. నిర్లక్ష్యం చూపిన అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని తెలిపారు. సమాచారం తీసుకునే లబ్ధిదారులు దానికి అయ్యే ఖర్చును భరించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈవో సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

సదుంలో భారీ వర్షం



సదుంలో టమాటా తోటలో చేరిన వర్షపు నీరు

సదుం: మండలంలో గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం 5 గంటల నుంచి ఒక గంట పాటు గాలులతో కూడిన వర్షం పడింది. పలుచోట్ల టమాటా తోటల్లోకి వర్షపు నీరు చేరింది. గాలీవానకు సదుంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రజల్ని మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం



మతుకువారిపల్లెలో క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పులిచెర్ల(కల్లూరు) : మోసపూరిత హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు అమలుచేయకుండా ప్రజలను మోసం చేస్తోందని వైఎస్సార్‌సీపీ నాయకుడు, ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, మండల కన్వీనర్ నాదమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా ఆరోపించారు. వారు గురువారం మతుకువారిపల్లెలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అలవిగాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబునాయుడు హామీలను తుంగలో తొక్కారని దుయ్యబట్టారు. ఏడాదికే ప్రజల విశ్వాసం కోల్పోయారని, తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నారని తెలిపారు. ఇచ్చిన హామీలను తూచా తప్పకుండా నెరవేర్చే ఏకైక నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రజలు గుర్తించారని తెలిపారు. అందువల్లే ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని గుర్తు చేశారు. అనంతరం మండలంలోని మతుకువారిపల్లె, చల్లావారిపల్లె, పాతపేట, వెంకటదాసరపల్లె, బోడిరెడ్డిగారిపల్లె పంచాయతీల్లో పర్యటించి ప్రజలకు చంద్రబాబునాయుడు చేసిన మోసాలను వివరించారు. అనంతరం రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ రావాలని కోరుతూ అక్కడి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కొబ్బరి కాయలు కొట్టారు. కార్యక్రమంలో చంద్రశేఖరరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, ఉషారాణి, నటరాజ, దాము, ఎస్వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణపై అవగాహన అవసరం



నులి పురుగుల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

రొంపిచెర్ల: నులి పురుగుల నివారణపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ దినేష్‌కుమార్ నాయక్ తెలిపారు. ఆయన గురువారం ఎంపీడీవో కార్యాలయంలో నులి పురుగుల నివారణపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కడుపులో నులి పురుగులు ఉంటే అనారోగ్యం బారిన పడే అవకాశం ఉందన్నారు. 1–19 ఏళ్ల మధ్య ఉన్న వారందరూ నులి పురుగుల నివారణకు అల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలన్నారు. అలాగే 2 ఏళ్ల లోపు పిల్లలకు మాత్రను పొడి చేసి తాగించాలన్నారు. త్వరలోనే నులి పురుగుల నివారణకు మాత్రలను పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏవో రెడ్డెప్పఆచారి, ఎంఈవో శ్రీనివాసులు, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, ఉన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

సదుం: మండలంలోని అన్ని పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం మంజూరు చేసిన ఆల్బెండజోల్ మాత్రలను గురువారం ఎంఈవో–2 దామోదరకు అందజేసినట్లు చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ చరణ్ తెలిపారు. ఆగస్టు 12న నులి పురుగుల నివారణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అనంతరం పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం సుబ్రమణ్యం, ఆరోగ్య సిబ్బంది నీలకంఠ, హేమలత, దీపా, అబిదాబీ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

రొంపిచెర్ల: పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులకు పూర్వ విద్యార్థి, ఎన్‌ఆర్ఐ ఊటుకూరివారిపల్లెకు చెందిన దేవులపల్లె నాగరాజరెడ్డి గురువారం నగదు పురస్కారాలు అందజేశారు. మండలంలోని పెద్దమల్లెల ఉన్నత పాఠశాల విద్యార్థులు భువనేశ్వర్ 548, గౌతమ్‌కుమార్ 547, వినీల 482 మార్కులు సాధించి ప్రతిభ చూపారు. వారికి వరుసగా రూ.11 వేలు, రూ.10 వేలు, రూ.9 వేలు నగదు బహుమతితోపాటు ప్రశంసా పత్రాలు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ తాను కూడా మారుమూల గ్రామంలో జన్మించినా బాగా చదువుకుని ప్రస్తుతం లండన్‌లో స్థిరపడినట్లు తెలిపారు. కష్టపడి చదువుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకోవచ్చని చెప్పారు. ప్రతి ఏటా తాను నగదు పురస్కారాలు అందజేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈవో శ్రీనివాసులు, హెచ్ఎం రవీంద్రనాథరెడ్డి, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.



విద్యార్థులతో దాత నాగరాజరెడ్డి

విద్యతోనే ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న వార్డెన్ శీనప్ప

పలమనేరు: విద్యతోనే ఉన్నత శిఖరాలు సాధ్యమని కొనమాసనపల్లి హాస్టల్ వార్డెన్ శీనప్ప తెలిపారు. ఆయన గురువారం హాస్టల్‌లో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇక్కడ హాస్టల్‌లో 107 మంది పిల్లలు వున్నారని తెలిపారు. అందరూ పేద కుటుంబాల నుంచి వచ్చిన వారేనని తెలిపారు. తాను కూడా పేద కుటుంబం నుంచి వచ్చానని పేర్కొన్నారు. చదువు కోసం అనేక కష్టాలు పడ్డానని తెలిపారు. అందువల్లే హాస్టల్‌లో వున్న పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలనే తలంపుతో కష్టపడుతున్నట్టు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ధర్మేంద్ర, మునెప్ప పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: కుటుంబ కలహాలతో యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని బసివినాయునిపల్లెకి చెందిన హేమంత్ (24) కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెందాడు. గురువారం ఉదయం పురుగుల మందు తాగాడు. అపస్మారక స్థితిలో వున్న అతన్ని కుటుంబ సభ్యులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు కీలపట్లలో సౌభాగ్యం కార్యక్రమం



సౌభాగ్యం కార్యక్రమం పోస్టర్

గంగవరం: మండలంలోని టీటీడీ అనుబంధ కీలపట్ల శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మి వ్రతం సందర్భంగా సౌభాగ్యం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నీరుకుండ గజేంద్ర తెలిపారు. ఇందులో భాగంగా టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో మహిళలకు కుంకుమ, గాజులు, పూలు, పసుపు దారం, కంకణాలు అందజేస్తామని పేర్కొన్నారు. సౌభాగ్యం కార్యక్రమాన్ని ఆలయంలో మొట్టమొదటగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఉదయం స్వామివారికి నైవేద్య సమర్పణ అనంతరం ఈ కార్యక్రమం ఉంటుందని, మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

రేపు సౌభాగ్యం కార్యక్రమం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో సౌభాగ్యం కార్యక్రమం నిర్వహించనున్నట్టు ఆలయ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. వరమహాలక్ష్మీ పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇందులో భాగంగా సౌభాగ్యం పేరిట భక్తులకు పద్మావతి అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపు దారము, కంకణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

ఆస్పత్రిలో టీవీ చోరీ

పుంగనూరు: పట్టణంలోని స్థానిక ఏరియా ఆస్పత్రిలోవున్న టీవీని దుండగులు బుధవారం రాత్రి చోరీ చేశారు. ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో టీవీని ఏర్పాటుచేశారు. ఈ క్రమంలో దొంగలు దాన్ని చోరీ చేసినట్టు గురువారం ఉదయం సిబ్బంది గుర్తించారు. అధికారులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం



నూతన వధూవరులతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి

రొంపిచెర్ల: చిన్నగొట్టిగల్లు మండలం జంగావాండ్లపల్లె పంచాయతీ బోరెడ్డిగారిపల్లెకు చెందిన మాజీ సర్పంచ్ వాసుదేవ రెడ్డి కుమారుడు భార్గవ్‌రెడ్డి పెళ్లి గురువారం రాత్రి రొంపిచెర్ల మండలం పెద్దగొట్టిగల్లు పంచాయతీలోని వీఎంఆర్ కల్యాణ మండపంలో జరిగింది. ఇందులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు మాధవరెడ్డి, కరీముల్లా, ఎల్.మహబుబ్‌బాషా, మంజూర్, బావాజీ సాహెబ్, ఖలీల్ పాల్గొన్నారు.

చంద్రబాబును ప్రజలు విశ్వసించరు



క్యూ ఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

సదుం: హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చిన తర్వాత విస్మరించడం చంద్రబాబు నైజమని, ఇకమీదట ఆయనను ప్రజలు విశ్వసించరని జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి తెలిపారు. మండలంలోని అమ్మగారిపల్లె, గొంగివారిపల్లె, నడిగడ్డ, చెరుకువారిపల్లెలో గురువారం బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను తేదీ ప్రకారం కచ్చితంగా అమలుచేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ సంక్షేమ పథకాలను నిలపలేదన్నారు. చంద్రబాబునాయుడు సూపర్ సిక్స్‌తో పాటు పలు హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలను నిలువునా మోసం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. వైఎస్సార్ సీపీ కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబునాయుడు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, వైస్ ఎంపీపీలు అమరావతి, ధనుంజయరెడ్డి, సర్పంచులు నర్మద, వరలక్ష్మి, నారాయణరెడ్డి, ఐశ్వర్య, సింగిల్ విండో మాజీ చైర్మన్ తిమ్మారెడ్డి, వాసు, పుత్రాజు, మునిరాజ, నారాయణరెడ్డి, గిరిధర్ రెడ్డి, యాదవేంద్రరెడ్డి, ధనశేఖర్ రెడ్డి, వెంకటస్వామి పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న యువకుడు

గంగవరం: మండలంలోని దండపల్లి వైఎస్సార్ జంక్షన్‌లో గురువారం ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొంది. దీంతో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు ద్విచక్ర వాహనంలో దండపల్లి వైఎస్సార్ జంక్షన్‌లో రోడ్డు క్రాస్ చేస్తున్నారు. ఈ క్రమంలో బెంగళూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో బైక్ వెనుక కూర్చున్న వినాయక(18) కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని అతన్ని పలమనేరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు. మిగిలిన వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

నైపుణ్య సర్టిఫికెట్ల పంపిణీ

పలమనేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన వారికి గురువారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఇక్కడ 28 మంది పలు కోర్సుల్లో శిక్షణ పొందారు. ఈ దఫా కొత్తగా ఈ కోర్సుల్లో చేరేవారు సైతం వెంటనే స్థానిక కళాశాలలోని కార్యాలయాన్ని సంప్రదించాలని ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు.



సర్టిఫికెట్లు పొందిన వారితో నిర్వాహకులు

శ్రీకృష్ణదేవరాయులుకు ఘన నివాళి



శ్రీకృష్ణదేవరాయుల పట్టాభిషేక దినోత్సవంలో బలిజ సంఘం నాయకులు

పుంగనూరు: విజయనగర సామ్రాజ్యాధినేత శ్రీకృష్ణదేవరాయుల 516వ పట్టాభిషేక దినోత్సవాన్ని గురువారం బలిజ కులస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగా శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లోవున్న రాయల విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆర్‌పీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాఘవరాయల్, నియోజకవర్గ కన్వీనర్ జనార్థన్‌రాయల్, బలిజ సంఘం ప్రతినిధులు నానబాల చిన్నమణి, నానబాల గణేష్, వెంకట్రమణ రాయల్, పరమేష్, రామకృష్ణ, గోపి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.